

సన్నాల కోసం క్యూ

వరికోతలు ప్రారంభం కావడంతో సన్న రకం ధాన్యం కొనుగోలు చేయడానికి వ్యాపారులు గ్రామాలకు క్యూ కడుతున్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.9 /26.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లక్ష్యం దాటిన విద్యుదుత్పత్తి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుత్ కేంద్రంలో లక్ష్యం దాటి ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 75 మిలియన్ యూనిట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 75.16 మి. యూనిట్ల కరెంట్ ఉత్పత్తి చేశారు. దీంతో జల విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహించే ఇంజినీర్‌లను జెన్‌కో చీఫ్ ఇంజినీర్ రమేశ్, ఎస్‌ఈ శ్రీనివాస్, డీఈఈ శ్రీనివాస్ అభినందించారు. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపడుతుండటంతో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ప్రస్తుతం రెండు టర్బయిన్‌ల ద్వారా 10.09 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి అవుతోంది.

తగ్గుతున్న నీటిమట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. కాకతీయల కాలువ ద్వారా ఏడు వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 347 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 146 క్యూసెక్కులు, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకం ద్వారా 200 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 403 క్యూసెక్కులు పోతోంది. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1061.40(15 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు



మోపాల్: మండలంలోని మంచిప్పలో గల శేర్ల శ్యామ్ గౌడ్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, మెడికల్ దుకాణంలో శుక్రవారం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తనిఖీలు చేశారు. అలాగే మరో ఆర్‌ఎంపీ కామేశ్వర్ క్లినిక్‌లోనూ పరిశీలించారు. శ్యామ్ గౌడ్ క్లినిక్‌లో అలోపతి మందులు నిల్వ ఉన్నట్లు గమనించారు. డ్రగ్ లైసెన్స్ లేకపోవడంతో 11 రకాల మందులను సీజ్ చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తెలిపారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో నిజామాబాద్ మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పారు. ఆకుల సుజాత శ్రీశైలంతో పాటు మాజీ కార్పొరేటర్లు కెప్టెన్ తేజస్విని శ్రీనివాస్‌రెడ్డి, పుప్పాల విజయ భాజన్న, అంతిరెడ్డి లత దేవేందర్‌రెడ్డి, ఏమగంటి గంగామణి నరేందర్‌గౌడ్, గోపు సుగుణ లక్ష్మణ్, శ్రీహరినాయక్, మాజీ కోఆప్షన్ సభ్యులు టి చంద్రకళ, జెండా బాలాజీ గుడి మాజీ చైర్మన్ ముత్యాల ప్రకాష్, నాయకులు చిన్నంగారి గంగారెడ్డి, ఎద్దడి మధుసూదన్ రెడ్డి, సలేందర్ బాబురావు, తెలంగాణ జాగృతి నగర మహిళా అధ్యక్షురాలు ఎన్.అపర్ణ, ఎలదండి కృష్ణ, రమేష్, చింతకాయల రంజిత్, వీర్ కుమార్, చింతకాయల రాకేష్ చేరారు.

మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి..



రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

నేడు కాంగ్రెస్ సన్నాహక సమావేశం

డిచ్‌పల్లి: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ నేతల సన్నాహక సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులోని పార్టీ రూరల్ కార్యాలయం వద్ద ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశంలో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

ముఖ్యనేతలతో సీఎం సమీక్ష

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార వ్యూహంపై చర్చ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీభవన్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రచార పర్వంలో ఏవిధంగా ముందుకెళ్లాలనే విషయమై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ముత్యాల సునీల్‌రెడ్డి, వినయ్ రెడ్డి, కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

జింకలు విలవిల!



శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ వద్ద జింకలు



- గోదావరి తీరంలో వేటాడుతున్న కుక్కలు
- తగ్గిపోతున్న వన్యప్రాణుల సంఖ్య
- శివారు గ్రామాల్లో లేగదూడలనూ వదలని శునకాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): గోదావరి తీరంలో వన్య ప్రాణులకు రక్షణ కరువైంది. జింకలను కుక్కలు వేటాడి చంపుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో జింకల సంఖ్య తగ్గిపోతోంది. ఒకప్పుడు వందల సంఖ్యలో కనిపించే జింకలు ఇప్పుడు పదికి మించి కనిపించడం లేదు. వన్యప్రాణులను చూసేందుకు వెళ్లిన వారికి కుక్కల మందలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోతే ఎకో టూరిజం ఏర్పాటయ్యే నాటికి జింకలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి ఏడాది వేసవిలో ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ తగ్గిపోయి పచ్చిక బయళ్లు ఏర్పడుతాయి. చిన్నయానం, గాదేపల్లి, జీజీ నడ్కుడ, గంగాసముందర్, అన్నారం, నికాల్‌పూర్ గ్రామాల శివార్లలో కిలో మీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తుంది. పచ్చికను మేసేందుకు జింకలు బ్యాక్‌వాటర్ ప్రాంతానికి వస్తుంటాయి. ఐదారేళ్ల కిందట ఎటు చూసినా జింకల మందలే కనిపించేవి. కుక్కల బెడద, సందర్శకుల తాకిడి లేకపోవడంతో అవి స్వేచ్ఛగా విహరించేవి. ఎప్పుడైతే వీధి కుక్కలు జింకలను తినడానికి రుచిమరిగాయో అప్పటి నుంచి జింకలకు ప్రాణహాని ఏర్పడింది. జింకల పరుగును అందుకోలేని శునకాలు తెలివిగా నలుదిక్కుల నుంచి వేటాడుతున్నాయి. దీంతో కుక్కల చేతికి చిక్కిన జింకలు విలవిల్లాడుతూ ప్రాణాలు విడుస్తున్నాయి. రైతులు, మత్స్యకారులు కుక్కలను తరిమినప్పటికీ మళ్లీ వస్తున్నాయి. అదే విధంగా పర్యాటకులు కూడా జింకలను దగ్గరి నుంచి చూసేందుకు వాటిని వెంబడిస్తున్నారు. భయంతో అవి వేరే చోటికి వెళ్లిపోతున్నాయి. ప్రస్తుతం గోదావరి తీరంలో జింకల సంఖ్య తగ్గిపోవడంతో శివారు గ్రామాల్లోని లేగదూడలపై కుక్కలు దాడి చేసి చంపేస్తున్నాయి.



కుక్కల దాడిలో మృతి చెందిన జింక (ఫైల్)



జింకల వేట కోసం మాటు వేసిన కుక్కలు

తక్షణ చర్యలు అవసరం

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తగ్గినప్పుడే కాకుండా వర్షాకాలంలో వరద నీరు పెరిగిన సమయంలో కూడా జింకల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. పచ్చిక బయళ్లకు వరదనీరు భారీగా వచ్చి చేరడంతో జింకలు నీటిలో మునిగిపోతున్నాయి. ఫారెస్టు అధికారులు, మత్స్యకారులు కలిసి వాటిని కాపాడిన సందర్భాలు చాలా ఉన్నాయి. వరద నీరు వచ్చిన సమయంలో జింకలు ప్రాణాలను రక్షించుకోవడానికి గోదావరి ఒడ్డున ఉన్న పొలాల వద్దకు వస్తున్నాయి. దీంతో కుక్కలు జింకలను వేటాడడం మరింత సులభంగా మారుతోంది. ఈ విధంగా గత కొన్నేళ్లలో చాలా జింకలు కుక్కలకు బలయ్యాయి. అధికారులు వాటికి పోస్టుమార్టం నిర్వహించి దహనం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే జింకలు పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంది. కుక్కలను పట్టుకొని దూర ప్రాంతాలకు తరలిస్తేనే జింకలు బతుకుతాయని స్థానికులు చెబుతున్నారు. ఇది తప్ప వేరే మార్గం కూడా లేదని అధికారులు పేర్కొంటున్నారు. అటవీ సిబ్బందిని కూడా ఈ ప్రాంతానికి నియమించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఒక్కరే పర్యవేక్షణ చేయడం సాధ్యపడడం లేదు.

దూడలను చంపేశాయి



గంగలో జింకలను వేటాడి తినడం అలవాటు పడిన కుక్కలు ఊరిలోకి వచ్చి పశువులపై దాడులు చేస్తున్నాయి. నెల రోజుల్లో రెండు దూడలు చనిపోయాయి. అధికారులు స్పందించి కుక్కలను పట్టుకెళ్లాలి.

– రాజారెడ్డి, రైతు, గాదేపల్లి

పర్యవేక్షిస్తున్నాం..

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో కుక్కలతో వన్య ప్రాణులకు ప్రాణహాని ఉన్న విషయం వాస్తవమే. సందర్శకులు కూడా వాటిని ఇబ్బంది పెట్టే పనులు చేస్తున్నారు. జింకలను రక్షించడానికి అటవీ శాఖ పరిధిలో ఉన్న నిబంధనల మేరకు పర్యవేక్షణ చేస్తున్నాం. కుక్కలను పట్టుకుని ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అదనంగా బీట్ ఆఫీసర్ ఉంటే పర్యవేక్షణ చేయడం సులభంగా ఉంటుంది.

– సుధాకర్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి

కాంగ్రెస్–బీజేపీ మధ్యే పోటీ



- బీఆర్‌ఎస్ ఇప్పటికే పతనమైపోయింది
- మరికొన్ని రోజుల్లో ఆ పార్టీ ఖాళీ అవుతుంది
- ప్రధాని ప్రకటించిన పసుపు బోర్డును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారు
- పార్లమెంట్ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు ఆదరించిన జీవన్‌రెడ్డి గెలుస్తారు
- ఇచ్చిన హామీలను అమలు చేసేది కాంగ్రెస్ మాత్రమే
- 'సాక్షి'తో ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ లోక్‌సభ స్థానాన్ని ఈసారి తప్పకుండా చేజిక్కించుకుంటామని ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పోటీ కాంగ్రెస్–బీజేపీ మధ్యేనన్నారు. శుక్రవారం 'సాక్షి' నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

■ విలువలు కలిగిన నేత, నిజాయితీ పరుడైన తాటిపర్తి జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేయడమంటేనే ఇప్పటికే సగం గెలిచినట్లు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే జీవన్‌రెడ్డికి మేధావి వర్గమైన గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీగా భారీ మెజారిటీతో పట్టం కట్టారు. జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ జీవన్‌రెడ్డి గెలుపునకు తిరుగులేదు.

■ కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎన్ని కుట్రలు చేసినా.. మా పార్టీ నాయకులు, శ్రేణులు కలసికట్టుగా పనిచేసి అధికారంలోకి వచ్చాం. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఇదే స్ఫూర్తితో పనిచేసి విజయం సాధిస్తాం. ఇప్పటికే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో 5 గ్యారంటీలను అమలు చేస్తోంది. త్వరలో మరో గ్యారంటీ కూడా అమలు చేస్తాం.

■ ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ పార్టీ హయాంలోనిదే. జిల్లాలో తెలంగాణ వర్సిటీ, మెడికల్ కాలేజీ, పసుపు పరిశోధన కేంద్రాలు, ఎత్తిపోతల పథకాలు ఇచ్చింది వైఎస్‌ఆర్ హయాంలోనే. అదేవిధంగా 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ లాంటి అనేక పథకాలు అమలు చేసి చూపింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే. ఇప్పుడు అధినాయకత్వం ఆకాంక్షల మేరకు సీఎం రేవంత్ ఆధ్వర్యంలో అన్ని హామీలు అమలు చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ఏనాడు తప్పలేదు.

■ గత ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చి గెలిచిన అర్వింద్ హామీని నిలబెట్టుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పసుపు బోర్డును కోల్డ్ స్టోరేజీలో పెట్టారు. అర్వింద్ పట్ల ఆ పార్టీ కార్యకర్తలే వ్యతిరేకంగా ఉన్నారు. ఇక బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ నామమాత్రమే. బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఇచ్చే అవకాశముంటే కేసీఆర్ కుటుంబ సభ్యులే పోటీలో ఉండేవారు. హామీలను అమలు చేయని బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు.

■ ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుంది. బీఆర్‌ఎస్ ఇప్పటికే పూర్తిగా కుప్పకూలిపోయింది. కాంగ్రెస్ నాయకత్వం గేట్లు ఎత్తడంతో బీఆర్‌ఎస్ ఖాళీ అవుతోంది. బీఆర్‌ఎస్ పార్టీది ముగిసిన అధ్యాయం. ఉద్యమకారుల బలిదానాల మీద అధికారం చేపట్టిన కేసీఆర్ చివరకు ఆ పార్టీలో మొదటి నుంచి పనిచేసిన ఉద్యమకారులకు సైతం అన్యాయం చేశారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ మాత్రమే విలువ ఇస్తోంది. దీంతో అందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే.

క్లైమాక్స్‌కు బల్దియా రాజకీయం!

- నేడు అవిశ్వాసంపై ఓటింగ్‌కు ఏర్పాట్లు
- కాంగ్రెస్ శిబిరంలో సరిపడా కౌన్సిలర్లు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవిపై అవిశ్వాసానికి సంబంధించిన రాజకీయం క్లైమాక్స్‌కు చేరింది. ఈ నెల 30న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పక్షం రోజులుగా హైదరాబాద్, గోవా క్యాంపుల్లో ఉన్న కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం హైదరాబాద్ శివారులోని రిసార్టులకు చేరారు. శనివారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో కౌన్సిలర్లను సమావేశానికి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. 49 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. అయితే కాంగ్రెస్ శిబిరంలో 27 మంది కౌన్సిలర్లు ఉండగా, బీఆర్‌ఎస్‌కు చెందిన మరో తొమ్మిది మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్నారు. దీంతో అవిశ్వాసానికి సరిపడా బలం లభించింది. అవిశ్వాసం వీగిపోవడానికి చైర్‌పర్సన్ జాహ్నవి తరఫున ఆమె తండ్రి వేణుగోపాల్‌రావు అన్ని ప్రయత్నాలు చేశారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు. అలాగే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ జిల్లా నాయకులతో మాట్లాడి అవిశ్వాసం వీగిపోయేలా చూడాలని ఆదేశించారు. అయినప్పటికీ ఆ పార్టీ నేతల నుంచి సరైన స్పందన రాలేదని తెలుస్తోంది. ఇదే సమయంలో కోర్టులో స్టే కోసం ప్రయత్నించారు. అది కూడా అనుకూలించలేదని సమాచారం.



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం

దీంతో అవిశ్వాసం వీగిపోయే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. కాగా అధికారులు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశానికి సంబంధించి ఏర్పాట్లు చేశారు. మరికొన్ని గంటల్లో సమావేశం జరిగి ఓటింగ్ నిర్వహించనున్నారు.

అవిశ్వాసం నెగ్గితే ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న నిట్టు జాహ్నవిపై ప్రతిపాదించిన అవిశ్వాసం నెగ్గితే ఆమె పదవి నుంచి వైదొలగాల్సి ఉంటుంది. వెంటనే ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియకు బాధ్యతలు అప్పగిస్తారు. తర్వాత చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇస్తారు. చైర్‌పర్సన్ పదవిని ఇందుప్రియతో పాటు మరో కౌన్సిలర్ వనిత కూడా ఆశిస్తున్నారు. అయితే ఇప్పటికే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎవరు అన్నదానిపై కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అవిశ్వాసం నెగ్గి జాహ్నవి మాజీ అవుతుందా ? ఇందుప్రియ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ అవుతుందా ? అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

లబ్ధి పొందాలంటే ఆగాల్సిందే..

- ఎన్నికల కోడ్‌తో నిలిచిన పలు పథకాల ప్రారంభం
- అమలవుతున్న వాటిల్లోనూ రాని వారికి తప్పని నిరీక్షణ

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందని వారు ఎన్నికల కోడ్‌తో మరికొన్ని నెలలు ఓపిక పట్టాల్సిందే. పథకాలను లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే ప్రక్రియ ఇంకా పూర్తికాక ముందే ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. దీంతో ఇప్పటి వరకు లబ్ధి పొందని వారికి నిరీక్షణ తప్పడం లేదు. అలాగే కొత్త పథకాలను ప్రవేశ పెట్టిన మార్గదర్శకాలు వెలువడక ముందు కోడ్ అమలులోకి వచ్చింది. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల పంట రుణమాఫీ ప్రకటించారు. మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో రుణమాఫీ ప్రక్రియకు బ్రేక్ పడింది. మహాలక్ష్మి సాయం కింద పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలకు ప్రతినెల రూ.2,500 అందిస్తామని మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హులను ఎంపిక చేయక ముందే కోడ్ కూసింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున సాయం అందించే పథకానికి ఖమ్మంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అర్హులను ఎంపిక చేసి సాయం అందించే తరుణంలోనే ఎన్నికల ప్రకటన వెలువడింది. ఎన్నికల కోడ్ ఎత్తివేసే(జూన్ 4) వరకు ఆయా పథకాలు ప్రజలకు అందే అవకాశం లేదు.

గ్యాస్ రాయితీ కోసం..

రేషన్‌కార్డు వినియోగదారులకు ఎల్‌పీజీ సిలిండర్‌ను రూ.500కే అందిస్తున్నారు. వినియోగదారులు సిలిండర్ తీసుకునే సమయంలో మొత్తం నగదు చెల్లిస్తే రూ.500 మినహాయించి మిగిలిన సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు. జిల్లాలో 6.33లక్షల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఇందులో 4.02లక్షల మందికి రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు 1.58 లక్షల మంది వినియోగదారులను మాత్రమే గ్యాస్ సబ్సిడీ అందుకోవడానికి ఎంపిక చేశారు. మిగతా వారు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా జూన్ వరకు ఆగాల్సిందే.

జీరో బిల్లు రాకున్నా ఇబ్బంది లేదు..

ఆరు గ్యారంటీల్లో భాగంగా 200లోపు యూనిట్ల విద్యుత్ వాడిన వారికి జీరో బిల్లు అందజేస్తున్నారు. జిల్లాలో గృహజ్యోతికి 3.90 లక్షల కుటుంబాలు అర్హత ఉన్నాయని అధికారులు తేల్చారు. కానీ 2.37లక్షల మందికి మాత్రమే జీరో బిల్లులు జారీ అవుతున్నాయి. మిగతా వారికి సాంకేతిక కారణాలతో ఈ పథకం అందడం లేదు. దీనికోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి ఎంపీడీవో కార్యాలయాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటిని మూసివేశారు. దీంతో ఈ పథకానికి లబ్ధి పొందాలంటే కోడ్ ముగిసే వరకు ఆగాల్సిందే. అయితే అప్పటి వరకు అర్హులు బిల్లు కట్టాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. జీరో బిల్లు రాని వారు కోడ్ ముగిసిన తర్వాత అప్‌డేట్ చేయించుకుంటే సరిపోతుందని విద్యుత్ ఉద్యోగులు సూచిస్తున్నారు.

సంక్షేమ పథకాలు ఆపొద్దు



ఎన్నికల కమిషన్‌తో మాట్లాడి సంక్షేమ పథకాలను కొనసాగించాలి. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ రాయితీ తదితర పథకాలను పక్కాగా అమలు చేయాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– కొలిప్యాక ఉపేంద్ర, ఎంపీపీ, ఏర్గట్ల

రుణమాఫీ అమలు చేయాలి



ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేయాలి. ఇప్పుడు రుణం మాఫీ చేస్తే వర్షాకాలం పంటలకు కొత్తగా రుణాలు పొంది పెట్టుబడులకు నిధులను సమకూర్చుకోవడానికి అవకాశం ఉంటుంది.

– సల్ల రాజేశ్వర్, రైతు, తొర్తి

క్లుప్తంగా

పెంచిన ఫీజులు వెంటనే తగ్గించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల విభాగం ద్వారా జారీ చేసే సర్టిఫికెట్ల ఫీజులను పెంచడం దారుణమని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ క్యాంపస్‌ సెంట్రల్‌ లైబ్రరీ ఎదుట వర్సిటీ ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కార్యదర్శి అమృత్‌చారి మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గ్రామీణ ప్రాంత పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఎక్కువగా చదువుతుంటారన్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌, మెస్‌ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం సొంత డబ్బులు కట్టాల్సి వస్తోందన్నారు. కాన్వకేషన్‌ ఫీజును రూ.700 నుంచి ఒకేసారి రూ.3,500కు పెంచడం దారుణమన్నారు. అలాగే మిగతా సర్టిఫికెట్ల ఫీజులు పెంచడం విద్యార్థులపై భారం మోపడమేనని, వీసీ, రిజిస్ట్రార్‌ స్పందించి వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్‌ చేశారు. లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, ఉపాధ్యక్షులు సింహాద్రి, జాయింట్‌ సెక్రెటరీ సమీర్‌, నాయకులు అజయ్‌, సంతోష్‌, సాయికృష్ణ, దీపక్‌, హరినాథ్‌, వినోద్‌, జగడం సాయి, సంతోష్‌, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్‌ సమావేశం

భిక్కనూరు : జిల్లా కేంద్రమైన కామారెడ్డిలో నిసత్య గార్డెన్స్‌లో ఈనెల 31వ తేది ఆదివారం బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని భిక్కనూరు మండల బీఆర్‌ఎస్‌ పార్టీ మండల ప్రధానకార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్‌ తెలిపారు.మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్‌ గంప గోవర్దన్‌, జహీరాబాద్‌ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌లు హజరవుతున్నారన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని జల్దిపల్లి గ్రామంలో శుక్రవారం కుస్తీ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో టెంకాయ కుస్తీ నుంచి 3 తులాల వెండి కడెం వరకు పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు నిర్వాహకులు అందజేశారు. కుస్తీ పోటీలను చుట్టు ప్రక్కల గామాలను ప్రజలు తరలివచ్చి తిలకించారు.

ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌కు సన్మానం

బాన్సువాడ : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ కాసుల బాల్‌రాజ్‌ను శుక్రవారం పలువురు కలిసి సన్మానించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు మున్నూరుకాపు సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల నేతలు కాసుల బాల్‌రాజ్‌ను సన్మానించారు.

ఊడల నీడలో..



రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత కారణంగా జనం అల్లాడుతుండగా, దత్తాపూర్‌ గ్రామానికి చెందిన చిన్నారులు మాత్రం ఇలా ఊడల మర్రి నీడలో మిట్ట మధ్యాహ్నం క్రికెట్‌ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న భారీ మర్రిచెట్టు ఎంతో చల్లదనాన్ని ఇస్తోంది.

గింజల వేటలో..



ధాన్యం గింజల కోసం వచ్చిన మయూరం రైతులతోపాటు రోడ్డువెంబడి వెళ్తున్న వారిని ఆకట్టుకుంది. దత్తాపూర్‌ – నికాల్‌పూర్‌ బైపాస్‌ రోడ్డును దాటేందుకు రెక్కలు విప్పి గాలిలోకి ఎగిరింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– డొంకేశ్వర్‌(ఆర్మూర్‌)

కాలభైరవుడికి ఎంపీ బీబీపాటిల్‌ పూజలు



రామారెడ్డి : దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడు ఆలయంలో జహీరాబాద్‌ ఎంపీ, ప్రస్తుత బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ శుక్రవారం కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌, బీజేపీ నాయకులు మేదర్‌ సందీప్‌ పందుల గోపి, తదితరులు పాల్గొన్నారు

సన్నాల కోసం క్యూ

- యాసంగి సీజన్‌ ధాన్యం కొనుగోలుపై రైస్‌మిల్లర్ల ఆసక్తి
- మధ్యవర్తుల ద్వారా బేరసారాలు
- క్వింటాలుకు రూ.2,200 చెల్లించేందుకు ఒప్పందం
- ముందుగానే కోతకు వచ్చిన సన్నరకం వరి



రామన్నపేట్‌ శివారులో ఆరబోసిన సన్న రకం వరి ధాన్యం

మోర్తాడ్‌(బాల్కొండ): సన్న రకం వరి ధాన్యం కొనుగోళ్ల కోసం రైస్‌ మిల్లర్లు గ్రామాల్లో క్యూ కడుతున్నారు. సన్న బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్‌ ఉండటంతో క్వింటాల్‌ ధాన్యానికి రూ.2,200 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా సన్నరకాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనే కారణంతో గతంలో దొడ్డు రకాలనే ఎక్కువగా సాగు చేసేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తలు కొత్త వరి వంగడాలను సృష్టించారు. యాసంగిలోనూ సన్నాలు సాగు చేయడానికి వీలు కల్పించారు. బీపీటీ, హెచ్‌ఎంటీ వంటి రకాలతోపాటు వివిధ రకాల సన్నాలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో అంచనాలకు మించి రైతులు వరి సాగు చేశారు. 3.50లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. 4.50లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాలు 40 శాతం ఉన్నాయి. సన్న రకాలకు కొనుగోలు కేంద్రాల్లో బీ గ్రేడ్‌ ధరను వర్తింపజేస్తున్నారు. అంతేకాకుండా తరుగు తీయడం వల్ల రైతులకు పెద్దగా లాభం ఉండటం లేదు. కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకాలనే కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ఇదిలా ఉండగా, రైస్‌ మిల్లర్లు ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయడం, రూ.2,200ల ధర చెల్లించడంతోపాటు హమాలీ చార్జీలను కూడా వారే భరిస్తున్నారు. రైతులు కూడా సన్నరకాలను వ్యాపారులు, మిల్లర్లకే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మిల్లర్లు మధ్యవర్తులను నియమించుకుని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి మరో నాలుగు రోజుల సమయం ఉంది. సన్నాలను సాగు చేసిన రైతులు వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయించడానికి ఆసక్తి చూపుతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించిన వారం, పది రోజుల తరువాత డబ్బులు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. సన్నాలను సాగు చేసిన రైతులకు ఈసారి మంచి ధరనే లభిస్తుందని చెప్పొచ్చు.

పెరిగిన ఉపాధి కూలి

- రూ.272 నుంచి రూ.300కు పెంపు
- ఏప్రిల్‌ 1 నుంచి అమలులోకి



భీమ్‌గల్‌ మండలంలో కూలీల హాజరు నమోదు చేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌

మోర్తాడ్‌(బాల్కొండ): ఉపాధి హామీ పథకం కూలి రేటును పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ఆరంభంలో కూలి రేటును రూరల్‌ స్టాండర్డ్‌ షెడ్యూల్‌ ఆఫ్‌ రేట్‌(రూరల్‌ ఎస్‌ఎస్‌ఆర్‌) ప్రకారం పెంచడం ఆనవాయితీగా వస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణలో రోజువారీ కూలిని రూ.272 నుంచి రూ.300లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.15 పెంచగా, ఈ ఏడాది మాత్రం కొంత మొత్తాన్ని ఎక్కువే పెంచారు. పెంచిన కూలిరేటు ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి అమలులోకి రానుంది. జిల్లాలో 5.55లక్షల మంది కూలీలు పేర్లు నమోదు చేసుకోగా, రెగ్యులర్‌గా 2.50లక్షల మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ కూలీలలకు చెల్లించే కూలిని పెంచడం హర్షణీయమని పలువురు పేర్కొంటున్నారు.

> **ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి..**
>
> ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్‌ 1 నుంచి పెంచిన కూలి రేటు అమలుకానుంది. కూలి రేటును ప్రతి ఏడాది పెంచుతారు. గతంతోపోలిస్తే ఈ ఏడాది కొంత ఎక్కువగానే పెంచారు. రెగ్యులర్‌గా పనులకు వచ్చే కూలీలకు లాభం చేకూరుతుంది.
>
> – విద్యానంద్‌, ఏపీవో, కమ్మర్‌పల్లి

డీసీసీబీ అభివృద్ధికి కృషి చేయండి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్‌ రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధికి పాలకవర్గం, సిబ్బంది కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. బోధన్‌ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డితో కలిసి డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌రెడ్డి సీఎంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అవిశ్వాస తీర్మానం తరువాత రమేశ్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన వెంట బాన్సువాడ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, టీజీ మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి, డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం, మోత్కు భూమన్న, శంకర్‌, సాయికుమార్‌, శరత్‌, ఆనంద్‌ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ మినీ సెమినార్‌ హాల్‌లో గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీనునాయక్‌ ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌ టేబుల్‌ సమావేశాన్ని నిర్వహించారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్‌ మాట్లాడుతూ.. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వర్సిటీ అధికారులను డిమాండ్‌ చేశారు. అలాగే క్యాంపస్‌ హెల్త్‌ సెంటర్‌లో 24గంటలపాటు వైద్యులు అందుబాటులో ఉండాలని, కొత్తగా బాలికలకు నూతన వసతి గృహం నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన శక్తి విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్‌నాయక్‌, నరేశ్‌నాయక్‌, నిఖిల్‌ నాయక్‌, శివనాయక్‌, సంజయ్‌ నాయక్‌, కృష్ణ, శ్రీకాంత్‌, సూర్య పాల్గొన్నారు.

మానవతావాది వీపీ చందన్‌రావు



చందనాగ్ని కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

నిజామాబాద్‌ సిటీ: ప్రముఖ కవి వీపీ చందన్‌ రావు కవిత్వంలో మానవతావాదం తొణికిసలాడుతుందని, అందుకే అతని కవిత్వం సాఫల్యం దిశగా సాగిందని సీనియర్‌ జర్నలిస్ట్‌, సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. ప్రముఖ కవి, వ్యాఖ్యాత వీపీ చందన్‌ రావు రచించిన 'చందనాగ్ని' కవితా సంపుటి ఆవిష్కరణ సభను నగరంలోని హరిచరణ్‌ మార్వాడీ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవదాస్‌ మాట్లాడుతూ.. కవిత్వం జన్మతః వచ్చినా అధ్యయనంతో శిఖరాగ్రాలకు చేరుకుంటుందని, సమాజానికి దారి చూపుతుందన్నారు. తన జీవితంలో ప్రభావం చూపిన వారిలో అలిశెట్టి ప్రభాకర్‌ తర్వాత వీపీ చందన్‌రావు అని, ఆయన కవిత్వం సహజత్వంతో, చమత్కారంతో, మానవతా వాదంతో పాఠకులను ఆకట్టుకుంటుందన్నారు. 50 ఏళ్ల సాహిత్య జీవితంలో వీపీ చందన్‌రావు సృజించిన సాహిత్యమంతా ముందుతరం కవులకు, సాహిత్యాభిమానులకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ నాశేశ్వరం శంకరం కీలక ప్రసంగం చేశారు. 'చందనాగ్ని' చందన్‌రావు జీవితకాల సాఫల్యమని, తన ఇంటికి సాక్షాత్తు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్‌ సి నారాయణరెడ్డి రప్పించుకున్న ఘనత ఆయనదని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి పీ సరోజినీదేవి మాట్లాడుతూ.. అలతి అలతి పదాలతో అద్భుతమైన కవిత్వం రాయడంలో వీపీ చందన్‌రావు సిద్ధహస్తుడని అభినందించారు. మరో గౌరవ అతిథి, ప్రముఖ కవి కందాళై రాఘవాచార్య మాట్లాడుతూ.. డాక్టర్‌ సి నారాయణరెడ్డి అభిమానాన్ని అందుకున్న చందన్‌ రావును ఆయన.. 'చందనా నా హృదయ నందనా' అని ఆప్యాయతను పంచిన సందర్భాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘనపురం దేవేందర్‌, కార్యదర్శి డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావు, తెరసం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్‌, కవులు పంచరెడ్డి లక్ష్మణ్‌, తిరుమల శ్రీనివాస్‌ ఆర్య, గంట్యాల ప్రసాద్‌, డాక్టర్‌ మద్దుకూరి సాయిబాబు, డాక్టర్‌ పి రామ్మోహన్‌రావు, డాక్టర్‌ గణపతి అశోక్‌ శర్మ, టీ రేణుక, వసంత లక్ష్మణ్‌, పద్మావతి, సమత, బైస వీణ, బైస హరిదాస్‌, మధుసూదన్‌, ఉదయ్‌, ఆర్‌ మధు, తల్లావజ్జల మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు, అనంతరం హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో వీపీ చందన్‌రావును ఘనంగా సన్మానించారు.

18 బుల్లెట్‌ బైకులు సీజ్‌



కామారెడ్డి క్రైం: పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో అతిగా శబ్దం చేస్తూ తిరుగుతున్న వాహనాలపై పోలీసులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టారు. తనిఖీల్లో 18 బుల్లెట్‌ వాహనాలను సీజ్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. వాహనాలు అతిగా శబ్దం చేయడమే కాకుండా, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా సైలెన్సర్‌లు ఉంటే సహించబోమని హెచ్చరించారు. వాహనాలను సీజ్‌చేసి, శబ్దం వచ్చే సైలెన్సర్ల స్థానంలో నిబంధనల ప్రకారం ఉండాల్సిన వాటిని బిగించే విధంగా కౌన్సెలింగ్‌ ఇచ్చామని వెల్లడించారు.

క్రైం కార్నర్‌

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: రెండు రోజుల క్రితం కామారెడ్డి మండలం రామేశ్వరపల్లి శివారులో జరిగిన యువకుని హత్య కేసులో ఇద్దరిని రూరల్‌ పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన బోయ నవీన్‌ కుమార్‌ (24)ను ఈనెల 26న ఉదయం 7:30 గంటలకు దారికాచి ఇద్దరు వ్యక్తులు రామేశ్వరపల్లి శివారులో కత్తులతో పొడిచి హత్య చేశారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. శుక్రవారం సాయంత్రం ఆరెపల్లికి చెందిన భువనగిరి మధు, ప్రభాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్‌ సీఐ రామన్‌ తెలిపారు. రెండు కుటుంబాల మధ్య పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు వెల్లడించారు.

వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసుల తనిఖీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని వడ్డీ వ్యాపారి జాడె ప్రకాశ్‌ ఇంట్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా జాడె ప్రకాశ్‌ వడ్డీ వ్యాపారం చేస్తున్నాడన్న సమాచారం మేరకు అతడి ఇల్లు, దుకాణంలో తనిఖీలు నిర్వహించగా ప్రామిసరీ నోట్లు, బ్లాంకు చెక్కులు లభించినట్లు పోలీసులు తెలిపారు.

యువతితో ఆటో డ్రైవర్‌ అసభ్య ప్రవర్తన

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గాయత్రినగర్‌కు చెందిన ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గుడ్‌ ఫ్రై డే సందర్భంగా చర్చికి వెళ్లిన యువతి ఆటోలో వెళ్లింది. డబ్బులు ఇచ్చే సమయంలో డ్రైవర్‌ ఆమెతో అసభ్యంగా మాట్లాడడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆటో డ్రైవర్‌ను నవీపేట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

వృదుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని జీజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చిన వృద్ధుడు అదృశ్యమైనట్లు ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఆర్మూర్‌ మండలం మిర్దాపల్లికి చెందిన పోశన్న ఈ నెల 28న జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. ఒక రోజు చికిత్స చేయించుకున్న తర్వాత శుక్రవారం స్కానింగ్‌ కోసం కిందికి వచ్చి కనిపించకుండ పోయాడు. ఆస్పత్రి, బస్టాండ్‌ ప్రాంతాల్లో వెతికినా పోశన్న ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య దేవుసరి రాజవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

డ్యాన్స్‌ వద్దన్నందుకు ఆత్మహత్య

- చెట్టుకు ఉరేసుకున్న యువకుడు
- నిజాంసాగర్‌ మండలం చిన్నఆరేపల్లిలో ఘటన



భార్య స్వప్న, కుమారుడు విజయ్‌భార్గవ్‌తో అనిల్‌(ఫైల్‌)

నిజాంసాగర్‌(జుక్కల్‌): మద్యం సేవించి ఉన్న భర్తను పెళ్లి బరాత్‌లో డ్యాన్స్‌ చేయొద్దని భార్య వారించినందుకు ఆత్మహత్య చేసుకున్నాడు. నిజాంసాగర్‌ మండలం చిన్నఆరేపల్లిలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చెన్నబోయిన అనిల్‌ జక్కాపూర్‌కు చెందిన స్వప్నను 2020లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ భార్య స్వప్న, రెండున్నరేళ్ల కుమారుడు విజయ్‌భార్గవ్‌తో కలిసి అక్కడే ఉంటున్నాడు. బంధువుల పెళ్లి ఉండడంతో భార్య, కుమారుడిని వెంటబెట్టుకొని అనిల్‌ గురువారం వేకువజామున చిన్న ఆరేపల్లికి వచ్చాడు. పెళ్లి అనంతరం రాత్రి సమయంలో బరాత్‌ కోసం డీజే పెట్టారు. ఆ సమయంలో మద్యం సేవించి ఉన్న అనిల్‌ను డ్యాన్స్‌ చేయొద్దని భార్య స్వప్న వారించింది. ఈ క్రమంలో భార్యతో గొడవపడిన అనిల్‌ తన భార్యను జక్కాపూర్‌లోని అత్తవారింట్లో వదిలిపెట్టి, కుమారుడిని తీసుకొని చిన్న ఆరేపల్లికి చేరుకున్నాడు. ఇంట్లో కుమారుడిని వదిలి డీజే వద్దకు వెళ్లిన అనిల్‌ అక్కడి నుంచి గ్రామశివారులోని చెట్టు వద్దకు వెళ్లి మద్యం సేవించి షర్ట్‌ విప్పి అదే చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారిన తరువాత చెట్టుకు అనిల్‌ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అందరితో కలిసిమెలిసి ఉండే అనిల్‌ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన యువకుడు మృతి

- ఇరవై రోజుల క్రితం ఘటన
- చికిత్స కొనసాగుతుండగా పరిస్థితి విషమించి కన్నుమూత



బొడ్డు మహేశ్‌ (ఫైల్‌)

నందిపేట్‌(ఆర్మూర్‌): కుక్కకాటు కారణంగా మండల కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నందిపేటకు చెందిన బొడ్డు మహేశ్‌ (34 కొంతకాలంగా లక్కంపల్లి శివారులోని వ్యవసాయాధారిత పరిశ్రమ (సెజ్‌)లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 9వ తేదీన నైట్‌ డ్యూటీకి వెళ్లిన మహేశ్‌ సెజ్‌ ముఖద్వారం వద్ద నిద్రిస్తుండగా తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో మహేశ్‌ ముఖంపై తీవ్రగాయాలు కావడంతో తోటి ఉద్యోగులు వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అందించిన స్థానిక వైద్య సిబ్బంది జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. జిల్లా కేంద్రంలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చిన మహేశ్‌ మందులు వాడుతూ స్థానిక వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మహేశ్‌ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సౌమ్యుడైన మహేశ్‌ చనిపోవడం బాధాకరమని, బాధిత కుటుంబానికి సెజ్‌ యాజమాన్యం ఆర్థిక భరోసా కల్పించాలని స్థానికులు కోరారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు.

నగరంలో చైన్‌స్నాచింగ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గోటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చైన్‌స్నాచింగ్‌ జరిగింది. ఎస్సై సంజీవ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్‌ మండలం కులాస్‌పూర్‌ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు పనినిమిత్తం శుక్రవారం నగరానికి వచ్చారు. వినాయక్‌నగర్‌లోని రుక్మిణి చాంబర్‌ వద్ద ఆటో దిగుతుండగా దుండగులు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. సుమారు రెండు తులాల బంగారు గొలుసును దుండగులు ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. రుక్మిణి చాంబర్‌ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు.